క్లుప్తంగా

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోళ్లు ప్రారంభిస్తున్న అధికారులు

గంభీరావుపేట: రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని గంభీరావుపేట సింగిల్‌విండో సీఈవో రాజిరెడ్డి, మేనేజర్ సత్యంరావు కోరారు. మండల కేంద్రంలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. నాణ్యతా ప్రమాణాలతో కూడిన వరి ధాన్యాన్ని కేంద్రాలకు తెచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని, రైతులు సహకరించాలని కోరారు.

సైబర్ నేరాలతో అప్రమత్తం



మాట్లాడుతున్న ఎస్సై ఆంజనేయులు

కోనరావుపేట: సైబర్ నేరాలతో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఆంజనేయులు అన్నారు. మండలంలోని నిమ్మపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు నుంచి చేస్తున్నాం. ఓటీపీ చెప్పాలని అడిగితే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. విద్యార్థులు గంజాయి, మద్యపానానికి దూరంగా ఉండాలని, వాటితోనే జీవితాలు పాడవుతాయన్నారు. ద్విచక్రవాహనాలపై ట్రిపుల్ రైడ్ చేయవద్దన్నారు. లైసెన్స్‌లు లేకుండా వాహనాలను నడపవద్దన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల చదువుపై, ప్రవర్తనపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకే షీటీమ్



మాట్లాడుతున్న ఏఎస్సై ప్రమీల

కోనరావుపేట: మహిళల రక్షణే షీటీమ్ ప్రధాన ధ్యేయమని షీటీమ్ ఏఎస్సై ఎస్.ప్రమీల అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థులకు బుధవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. వారికి భద్రత కల్పించేందుకే పోలీస్ శాఖ ప్రత్యేకంగా షీటీమ్ ఏర్పాటు చేసిందన్నారు. బాలికలు రక్షణ చట్టాల గురించి తప్పనిసరిగా ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. విద్యార్థినులకు కళాశాల, బస్టాండులో ఎలాంటి ఇబ్బంది ఎదురైనా, ఎవరైనా వేధింపులకు గురిచేసినా టోల్‌ఫ్రీ నెంబర్ 100కు గానీ, వాట్సాప్ నెంబర్ 87126 56425 కు సమాచారం ఇచ్చిన వెంటనే సహాయాన్ని అందించడం జరుగుతుందన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు రహస్యంగా ఉంచి, నిందితులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్ వినియోగంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. వాటిలో ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ చేసేముందు వ్యక్తిగత భద్రతకు భంగం వాటిల్లకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయినులు, విద్యార్థినులు, షీటీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులపై చర్య తీసుకోవాలి

కోనరావుపేట: మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నం చేసిన నిందితులపై తగిన చర్యలు తీసుకోవాలని కోనరావుపేట తహసీల్దార్‌కు బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి చేసి హత్యాప్రయత్నం చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నిందితులపై చర్యలు తీసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, సింగిల్‌విండో చైర్మన్లు సంకినేని రాంమోహన్‌రావు, బండ నర్సయ్య, డైరెక్టర్ రాజు, నాయకులు పాల్గొన్నారు.

బోయినపల్లిలో..

బోయినపల్లి: ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపైన హత్యాయత్నం చేసిన నిందితుని తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ పుష్పలతకు వినతిపత్రాన్ని అందజేశారు.

డేంజర్ రోడ్డు

- కరీంనగర్–సిరిసిల్ల రోడ్డు గుంతలమయం
- ప్రమాదాలకు కారణమవుతున్న గుంతలు
- పట్టించుకోని అధికారులు
- ఫోర్‌లేన్ పొడిగించాలని వినతి

వేములవాడఅర్బన్: నిత్యం వందలాది వాహనాలు నడిచే సిరిసిల్ల–కరీంనగర్ రహదారిలో అడుగడుగున గుంతల వల్ల ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. వాహనదారులు ప్రమాదాలకు గురై మృతిచెందుతున్నారు. ఈ రహదారిలో ఉదయం, సాయంత్రం తేడా లేకుండా నిరంతరం వాహనాల రాకపోకలుంటాయి. కరీంనగర్ నుంచి వేములవాడ, సిరిసిల్ల, కామారెడ్డి వరకు నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. రాజన్న దర్శనానికి వచ్చే భక్తులు, వేములవాడ, సిరిసిల్లకు ప్రతీరోజు వచ్చే అధికారులు, ఉద్యోగులు ఈ రహదారిలోనే ప్రయాణిస్తుంటారు. గుంతలమయమైన రహదారిని మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఇదే దారిలో రోజూ ప్రయాణిస్తున్న అర్‌అండ్‌బీ అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆవేదన చెందుతున్నారు.



ఆరెపల్లి శివారు సిరిసిల్ల-కరీంనగర్ రహదారిలో రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు

నడిరోడ్డుపై గుంతలు

మిడ్ మానేరు వంతెన చివరి వరకు ఫోర్‌వే ఉంది. ఆ రహదారిని వెంటనే డబుల్ రోడ్డుకు కలపడంతో వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు. దాంతో వాహనాల తాకిడి ఒకవైపు కావడంతో రోడ్డు గుంతలుగా మారింది. రోడ్డుపై పడిన గుంతలను అధికారులు మొరం వేసి పూడ్చడంతో వాహనాల తాకిడికి మొరం లేచి మళ్లీ గుంతలు పడింది. నిత్యం వాహనాలు నడిచే దారిలో తారు రోడ్డుపై గుంతలు పడితే మొరం వేయడం ఏంటని ప్రయాణికులు ఆశ్చర్యపోతున్నారు.

ప్రమాదాలకు కారణం

ఫోర్ లేన్‌ను సడెన్‌గా డబుల్ రోడ్డుకు కలపడంతో ద్విచక్ర వాహనదారులకు రాత్రివేళ కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు అంటున్నారు. గత నెల 10న వేములవాడ మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన ముద్రకోల దేవరాజు (21) కోదురుపాక నుంచి వేములవాడకు వస్తుండగా ఇక్కడే రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇలా ఆరు నెలలుగా ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. అధికారులు పట్టించుకుని రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపిస్తాం



మిడ్ మానేరు బ్రిడ్జి చివర, రోడ్డు ఒక్కసారిగా ఫోర్ లేన్ నుంచి డబుల్ రోడ్డుకు కలవడంతో ఇరుకుగా మారింది. ఫోర్ లేన్‌ను మరో వంద మీటర్లు ముందుకు తీసుకువెళ్లి డబుల్ రోడ్డుకు కలిపేందుకు ప్రతిపాదనలు పంపిస్తాం. ఈఈ పరిధిలో మంజూరు తీసుకుని పనులు పూర్తయ్యేలా చూస్తాం.

– శాంతయ్య, డీఈ ఆర్‌అండ్‌బీ వేములవాడ

గుంతలను పూడ్చాలి



ఆరెపల్లి గ్రామం శివారులో రోడ్డు గుంతలమయంగా మారి వరుసగా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్తే గుంతల్లో ఎర్రమట్టి నింపి చేతులు దులుపుకున్నారు. ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఇటిక్యాల వెంకటేశ్. ఆరెపల్లి

ఫోర్ లేన్ ఏర్పాటు చేయాలి



మిడ్ మానేరు డ్యాం బ్రిడ్జి నుంచి వేములవాడ నందికమాన్ వరకు ఉదయం, రాత్రి తేడా లేకుండా వాహనాలు రద్దీగా మారాయి. రాత్రివేళ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు పట్టించుకుని ఈ రహదారిని ఫోర్ లేన్‌గా చేయాలి.

– రాకేశ్. ఆరెపల్లి

నియామకం

కాంగ్రెస్ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా రాజు

చందుర్తి: మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా చందుర్తి మండలం జోగాపూర్ గ్రామానికి చెందిన గద్దరాశి రాజును నియమించినట్లు నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ బొజ్జ మల్లేశం తెలిపారు. నియామక పత్రాన్ని డీసీసీ అధ్యక్షుడు, వేములవాడ అభ్యర్థి ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. తన నియామకానికి సహకరించిన పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, జెడ్పీటీసీ నాగం కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల ఇంటింటా ప్రచారం



బావుసాయిపేటలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోనరావుపేట: మండలంలోని బావుసాయిపేట, ధర్మారం, మామిడిపల్లిలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. బావుసాయిపేటలోని గంగిరెద్దుల కాలనీలో బైరగోని నందూ ఆధ్వర్యంలో, మామిడిపల్లిలో ఎల్లాల లింగారెడ్డి, సాసాల మల్లారెడ్డి ఆధ్వర్యంలో ప్రచారాన్ని నిర్వహించారు.

‘మంత్రి కేటీఆర్‌కే మా మద్దతు’



బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇస్తామంటున్న పిట్టల కాలనీ ప్రజలు

ముస్తాబాద్: ఇల్లు, అడ్రస్ లేని తమకు నిలువ నీడ కల్పించి గూడు కల్పించిన మంత్రి కేటీఆర్‌కే తమ ఓట్లు వేస్తామని పిట్టల కాలనీ(సంచారజాతి) వాసులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ముస్తాబాద్ మండలం మోహినికుంట కేజీఆర్‌కాలనీ వాసులు బీఆర్‌ఎస్‌కు ఓట్లు వేస్తామని బుధవారం ఏకగ్రీవ తీర్మానాలు చేసి బీఆర్‌ఎస్ నాయకులకు అందజేశారు. సర్పంచ్ వనజ, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోపాల్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, ఏఎంసీ చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ

ఇంటింటికీ బీఆర్‌ఎస్ ప్రచారం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లి, దుమాల, కిష్టంపల్లి, హరిదాస్‌నగర్, ఎల్లారెడ్డిపేట గ్రామాల్లో ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి బుధవారం ప్రచారం చేశారు. ఇంటింటా తిరుగుతూ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. పార్టీ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, సర్పంచ్ బాల్‌రెడ్డి, ఎంపీటీసీ గీతాంజలి, నాయకులు పాల్గొన్నారు.



రాచర్లగొల్లపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

తంగళ్లపల్లి: మంత్రి కేటీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని తంగళ్లపల్లి బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పూర్మాని రాంలింగారెడ్డి ఆధ్వర్యంలో సారంపల్లి గ్రామంలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఏఎంసీ చైర్‌పర్సన్ పూసపెల్లి సరస్వతి, సర్పంచ్ కొయ్యడ రమేశ్, మహేశ్ పాల్గొన్నారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండలం బాబాయి చెరువు తండా గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రాజిరెడ్డి, చాంద్‌పాషా, శ్రీరామ్, రవి, రాములు, సంతోష్, లక్ష్మి, గుగులోత్ కళ పాల్గొన్నారు.

ముస్తాబాద్‌లో..

ముస్తాబాద్: మండల కేంద్రంలో టీఆర్‌ఎస్‌ను గెలిపించాలని సర్పంచ్ సుమతి, ఎంపీటీసీ మంజుల, బీఆర్‌ఎస్ మండల, పట్టణాధ్యక్షుడు సురేందర్‌రావు ప్రచారం చేశారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రచారం చేయండి



మాట్లాడుతున్న చిక్కాల రామారావు

తంగళ్లపల్లి: ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయం తక్కువగా ఉందని ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, ఎంపీపీ పడిగెల మానస, ఎంపీటీసీ కోడి అంతయ్య, నాయకులు వెంకట రమణా రెడ్డి, జక్కుల నాగరాజు, సద్ధ రోజా పాల్గొన్నారు.

రజక సంఘం మద్దతు

కోనరావుపేట: మండలం వెంకట్రావుపేట, కొలనూర్, మామిడిపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు చల్మెడ లక్ష్మీనర్సింహారావుకు మద్దతుగా ప్రచారాన్ని చేశారు. వెంకట్రావుపేటలో రజక సంఘం చల్మెడకు మద్దతుగా తీర్మానించింది. రజక సంఘం అధ్యక్షుడు సందు రవి, మాదిగ సంఘం అధ్యక్షుడు పోశయ్య, ఉపసర్పంచ్ భూమయ్య, నాయకులు మల్లాగౌడ్, శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, వీరవేణి తిరుపతి, సతీశ్, పవన్ పాల్గొన్నారు.

మీ ఇంటివాడిలా ఉంటా

- కాంగ్రెస్ వేములవాడ అభ్యర్థి ఆది శ్రీనివాస్



కార్పెంటర్ సొసైటీ సభ్యులతో ఆది శ్రీనివాస్

వేములవాడ: వేములవాడలోనే నివాసం ఏర్పరచుకున్న తాను ఎల్లవేళలా అందరికీ ఇంటివాడిలా అందుబాటులో ఉంటానని.. తనను ఆశీర్వదించండని కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ కోరారు. స్థానిక కార్పెంటర్ సొసైటీలో బుధవారం సభ్యులు ఆది శ్రీనివాస్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు.

బొట్టు మీకు ఓటు మాకు



బొట్టు పెడుతూ ఓట్లు అభ్యర్థిస్తున్న చల్మెడ కూతురు

చందుర్తి: మండలంలోని రామన్నపేట, తిమ్మాపూర్ గ్రామాల్లో వేములవాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు తనయ నిహారిక గడపగడపకు వెళ్లి ఇంట్లో మహిళలకు బొట్టు పెట్టి ఓటు వేయాలని కోరారు. తన తండ్రి లక్ష్మీనరసింహారావును గెలిపిస్తే ఎల్లవేళలా అందుబాటులో సేవ చేస్తామంటూ ఓటర్లను అభ్యర్థించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, రామన్నపేట సర్పంచ్ దుమ్ము అంజయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోతురాజు నగేశ్ పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో చల్మెడ సతీమణి



ఓటు అభ్యర్థిస్తున్న చల్మెడ సతీమణి సునీల

వేములవాడ: వేములవాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు సతీమణి సునీల పట్టణంలోని పలు వార్డుల్లో బుధవారం ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి రాజు, కౌన్సిలర్ గోలి మహేష్, నిమ్మశెట్టి విజయ్, జెడ్పీ మాజీ చైర్మన్ తీగల రవీందర్ గౌడ్, సెస్ మాజీ డైరెక్టర్ గజానందరావు, కో–ఆప్షన్ సభ్యుడు బాబు, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమపాలన కాంగ్రెస్‌కే సాధ్యం

- సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలో సంక్షేమపాలన అందించడం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం వెంకంపేటలో గడపగడపకు ప్రచారం, పలువార్డుల్లో పార్టీలోకి చేరుతున్న బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలకు ఆహ్వానసభలు నిర్వహించి మాట్లాడారు. సోనియాగాంధీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలపై ప్రజలకు వివరించారు. పలు వార్డులకు చెందిన స్థానికులు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఓటర్లతో నేరుగా పలకరిస్తూ తనదైన శైలిలో ప్రచారాన్ని చేపట్టారు. పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, యెల్లె లక్ష్మీనారాయణ, వైద్యశివప్రసాద్, గోలి వెంకటరమణ, మ్యానప్రసాద్, గోనె ఎల్లప్ప, వెంకటేశం పాల్గొన్నారు.



వెంకంపేటలో ఓటర్లతో కేకే మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: భవన, తాపీ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని కేకే అన్నారు. ఎల్లారెడ్డిపేటలో బుధవారం తాపీకార్మికులను కలిసి వారి మద్దతు కోరారు. నిరుపేదలకు ఇళ్ల నిర్మాణాల కోసం ఇందిరాగాంధీ హయాం నుంచి ఇప్పటి వరకు నిబద్ధతతో పని చేస్తుందన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్, జిల్లా ప్రధాన కార్యదర్శి పసుల కృష్ణ, నాయకులు లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం ఎర్రనర్సుపల్లిలో బీజేపీ, కాంగ్రెస్‌లకు చెందిన దాదాపు 100 మంది నాయకులు బుధవారం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఎమ్మెల్యే ఆహ్వానించారు. మండలంలోని పాండలపురంలో రసమయి ప్రచారం చేస్తుండగా గ్రామానికి చెందిన వృద్ధురాలు పత్తెం సత్తవ్వ ఆప్యాయంగా పలకరించింది. ×నువ్వే గెలుస్తవ్ ̄ బిడ్డా అంటూ ఆశీర్వదించింది. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య, బీఆర్‌ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన రొడ్డ శ్రీకాంత్ అనారోగ్యంతో బాధపడుతుండగా పరామర్శించారు. అధైర్యపడొద్దని అండగా ఉంటానని హామీ ఇచ్చారు.



ఎర్రనర్సుపల్లిలో రసమయి సమక్షంలో చేరికలు

రవిశంకర్‌ను గెలిపించాలని బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం

బోయినపల్లి: మండలంలోని మల్లాపూర్, కొత్తపేట, మర్లపేట గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ చొప్పదండి అభ్యర్థి సుంకె రవిశంకర్‌కు మద్దతుగా డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్ రెడ్డి, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ బుధవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు జోగినపల్లి ప్రేమ్‌సాగర్‌రావు, బీఆర్‌ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణ రెడ్డి, సెస్ డైరెక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.



మల్లాపూర్ ప్రచారం చేస్తున్న నాయకులు

రాష్ట్రంలో రైతు వ్యతిరేక పాలన

సిరిసిల్లఅర్బన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వమని సిరిసిల్ల బీజేపీ మున్సిపల్ ఫోర్ లీడర్ బొల్గం నాగరాజ్ గౌడ్ ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 2018లో రైతులకు లక్ష లోపు రుణ మాఫీ చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. రైతుబంధు పేరిట వందల ఎకరాలు ఉన్న భూస్వాములకు రైతుబంధు సొమ్మును కట్టబెడుతుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రైతులకు వచ్చే పోత్సాహకాలకు గండికొట్టి రైతుబంధు ఇస్తూ రైతులను మోసం చేస్తుందన్నారు. లక్షలు పెట్టి నిర్మించిన రైతు వేదికలు నిరూపయోగంగా మారాయన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్‌ను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న బొల్గం నాగరాజ్‌గౌడ్

చందుర్తి: వేములవాడ నియోజకవర్గ బీజేపీ పార్టీ అభ్యర్థి ఖరారు కాకున్న ప్రచారం మాత్రం ఊపందుకుంది. మండలంలోని మల్యాలలో బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ మార్త సత్తయ్య, రాష్ట్ర నాయకులు అల్లాడి రమేశ్ బీజేపీ అభ్యర్థికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

వేములవాడ: పెద్దపెల్లి జిల్లా ఎన్టీపీసీలో గతనెల 30న నిర్వహించిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్–14, 35, 45 కేజీల విభాగంలో జరిగిన కరాటే పోటీల్లో పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌కు చెందిన సీహెచ్ సూర్య సుశీల్, హంసిని స్కూల్‌కి చెందిన ఏ. హరిహరన్, సిరిసిల్ల పట్టణంలోని కేంద్ర విద్యాలయానికి చెందిన శివ చరణ్ తేజ సిల్వర్ మెడల్స్ సాధించినట్లు కరాటే మాస్టర్ ఎంఏ మన్నాన్ తెలిపారు.



పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులతో మాస్టర్లు

సెల్‌ఫోన్ అపహరణ

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని గోల్డెన్‌చికెన్ సెంటర్‌లో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లాడు. చికెన్ సెంటర్ ఓనర్ ముస్తాఫా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చికెన్ కోసం ఒకరు రాగా.. కోడిని కోసేందుకు నిర్వాహకుడు గదిలోకి వెళ్లాడు. తిరిగొచ్చేలోపే కౌంటర్‌పై పెట్టిన సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లాడు. వెంటనే చికెన్ సెంటర్ నిర్వాహకుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాజన్నపేటకు చెందిన వ్యక్తిపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పోయిన సెల్‌ఫోన్ అప్పగింత

తంగళ్లపల్లి: మండలానికి చెందిన అందం దేవయ్య సెల్‌ఫోన్ ఐదు నెలల క్రితం పోయింది. పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో సీఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ గుర్తించి ఎస్సై వెంకటేశ్వర్లు బాధితుడికి బుధవారం అందజేశారు. ఫోన్ గుర్తింపులో కృషిచేసిన కానిస్టేబుళ్లు కార్తీక్, శ్రీకాంత్‌ను ఎస్సై అభినందించారు.